ఇంత మూర్ఖులూ, దైవభక్తితో జ్ఞానేంద్రియాలు మూసుకుపోయిన వారు, మతం పట్ల అవసరమైన దానికంటే ఎక్కువ నమ్మకం వున్నవారు సి.బి.ఐ లాటి, దేశపు అత్యంత ప్రధానమైన డిపార్ట్‌మెంట్‌లో ఉంటారా అంటె - వుంటారు!!

"నాయనా! నా మీద అత్యంత భక్తితో నువ్వొచ్చి ఆ ఫైలు సంగతి చెప్పబూనావు. నీ భక్తికి మెచ్చి నీకో తాయెత్తు ఇస్తున్నాను. ఇంతకుముందు ఇచ్చిన దానికన్నా ఇది మరింత ప్రభావం కలది"

"కృతజ్ఞుడిని స్వామీ ..... "

స్వామి చీఫ్ భుజపు దండకు కట్టబడి వున్న తాయెత్తు తీసి, స్వయంగా మరో తాయెత్తు కట్టాడు.

"ఆ రెడ్‌ఫైలు సంగతి నేను చూసుకుంటాను స్వామీ"

"అఖ్కర్లేదు నాయనా దైవకృప వల్ల ఎప్పటి విషయాలు అప్పుడు దివ్యదృష్టితోనే గ్రహించగలను --"

తల్లడిల్లే భక్తితో చీఫ్ మరో మారు ప్రణామం చేసి వెళ్ళిపోయాడు. స్వామి అటువేపు చూస్తూ చేతిలోని పాత తాయెత్తుని వేళ్ళతో విప్పాడు. బ్యాటరీ అయిపోయిన మైక్రోఫోన్ క్రింద పడింది.

-- ఇంతలో ఒక వ్యక్తి అక్కడి కొచ్చాడు. అతడి పేరు రామ్ లాల్. ఆ సాయంత్రం వ్యవహారం నడపాల్సింది అతడే.

"ఈ రోజు మనం చేయబోయే పని సి.బి.ఐ.కి తెల్సిందట. కోడ్--కాలర్ లిఫ్టింగ్ ..... అడిటోరియం అంతా వాళ్ళు వుంటారేమో, ప్రోగ్రాం రేపటికి మార్చనా----?

"వద్దు నాయనా. యద్భావం తద్భవతి. వాళ్ళందరూ వుండడమే మంచిది"

తిరిగి పూజలో మునిగిపోయాడు స్వామి. రామ్‌లాల్ ఆక్కడ నుండి బయల్దేరి ధియేటర్ దగ్గరకు వచ్చాడు. అక్కడికింకా ప్రేక్షకులు చేరుకోలేదు. సాయంత్రం ఐదు కావొస్తూంది.

అతడి మనసులో ప్లాన్ క్లియర్‌గానే వుంది హత్యకి నలుగుర్ని ఉపయోగించదల్చుకున్నాడు అతడు. వాళ్లకి పేర్లు లేవు. A-1, A-2, A-3, A-4.---అంతే.

నాటక ట్రూపువాళ్ళు కలకల మాత్రం గ్రీన్ రూమ్‌లోంచి వినపడుతూంది. రామ్‌లాల్ తలెత్తి ముఖద్వారం వేపు చూశాడు. పెద్ద తోరణం లాటి గుడ్డా వేలాడుతూ వుంది.

***వికలాంగుల సహాయార్థం ఇందిరాగాంధీ***

***మహిళ కళాశాల నిర్వహణలో కళాభారతి నాటకం***

## ***"ఆఖరి పోరాటం"***

రామ్‌లాల్‌కి ఎందుకో నవ్వొచ్చింది.

ఏ పోరాటమూ లేక అతడి చేతులు దురదపెడుతున్నాయి. ఇప్పుడు. సి.బి.ఐ. రంగంలోకి

దిగింది. కాస్త దురద తీర్చవచ్చు. దేశపు నెం.1 చీకటి ప్రపంచపు లీడర్ క్రింద పని చేయడంలో నష్టం అదే, థ్రిల్స్ వుండవు. పోరాటాలు వుండవు. ఇన్నాళ్ళకి కోరిక తీరబోతూంది.

అదే సమయానికి లోపల రక్షణ ఏర్పాట్లు చేస్తూన్న డిప్యూటీ కమీషనర్ మనసంతా ఉద్విగ్నత నిండి ఉంది. ఇంత పెద్ద చీకటి ప్రపంచానికి ఎదురుగా, ఒంటరిగా పోరాడింది తను ఒక్కతే - ఈ రోజు పది మందికీ తెలిసింది. ప్రభుత్వంలో పాతిక శాతం "వాళ్ళ" మనుష్యులున్న పరిస్థితుల్లో ఈ విషయం రహస్యంగా వుండదిక. రెండు సంవత్సరాల కష్టం ఈ సాయంత్రం ఫలితమివ్వాలి.

"వేచిచూడు" అన్నది సి.బి.ఐ. ట్రెయినింగ్‌లో చెప్పే మొదటి పాఠం. ప్రస్తుతం చేస్తున్న పని అదే. ఇన్నాళ్ళు వేచిన దానికి ఈ రోజు ఫలితం కనబడాలి.

డి.సి.ల దృష్టి ఎదురుగా వున్న బ్యానర్ మీద పడింది. ఇందిరా గాంధీ మహిళా కళాశాల ఆధ్వర్యంలో ..... ఆఖరి పోరాటం.

తన కుటుంబానికి జరిగిన అన్యాయానికి స్వామి మీద పగ తీర్చుకోవడానికి అదే అవకాశం కావొచ్చు।

సునాదమాల కాళ్ళు వణికాయి.

ఆ అమ్మాయికి కాళ్ళు వణకడం కొత్త కాదు. బస్‌లో వెళుతున్నప్పుడు ఎవరైనా రౌడీ దూరం నుంచి నవ్వినా సరే ఆవిడ కాళ్ళు వణుకుతాయి. డబ్బు అందిస్తూ కండక్టరు చెయ్యి తగిలించినా కాళ్ళు వణుకుతాయి. వెంటనే స్నానం చెయ్యాల్సిందే.

ఈ రోజు మరీ ఎక్కువగా వణకడానికి కారణం - ప్రిన్సిపాల్ ఆమెతో "అమ్మాయ్! నువ్వు మెయిన్ గేట్ దగ్గర నిలబడి మంత్రిగారికి పుష్పగుచ్ఛం అందించు " అనడమే.

ప్రిన్సిపాల్ గత వారం రోజులుగా తెగ హడావుడి పడుతూంది. మంత్రిగారి దృష్టిలో ఎలాగయినా పడి పరిచయం పెంచుకుని తన ఊరికి ట్రాన్స్‌ఫర్ చేయించు కోవాలని ఆశ.

కాలేజీ బ్యూటి సునాదమాలని ముఖద్వారం దగ్గర నిలబెట్టడంలో ఆమె ఆశయం అదే! ఎవరయినా సరే - ఆ అమ్మాయిని ఒకసారి చూస్తే కాసింత దూరం వెళ్ళి తిరిగి మళ్ళీ చూడాల్సిందే. అంతటి స్టన్నింగ్ బ్యూటీ ఆమెది. ఆమె బ్రిలియంట్ స్టూడెంట్ కాదు కానీ ఒద్దికయిన అమ్మాయి. ఆమెలో వున్న ఒకే ఒక దుర్గుణం "భయం" ..... అయితే అంత అందమయిన అమ్మాయికి భయం కూడా ఒక అర్హతగానే జోడయింది.

దాదాపు నాలుగు గంటల నుంచీ ఆమెకి ఒళ్ళంతా చెమటలు పడుతున్నాయి. సాయంత్రం ఎప్పుడవుతుందా అని చూస్తోంది.

ఆయన వస్తాడు - లోపలికి వెళతాడు. గుమ్మం దగ్గర నిలబడి పుష్పగుచ్ఛం అందించాలి.

అంతే తాను చెయ్యవలసింది.

కానీ అందిస్తూండగా అది జారిపోతే? ఆయన దాన్ని చూసుకోకుండా లోపలికి

వెళ్ళి పోతే ..... అన్నీ ప్రశ్నలే.

తాను క్రింద వేపు పట్టుకుంటే ఆయన  మధ్యలో పట్టుకుని తీసుకుంటారా? తానే మధ్యలో పట్టుకుని అందించాలా? ఆయన చేతులు  తగిలితే ఎలా? అందించాక నమస్కారం పెట్టాలా? అవసరం లేదా? ఆయన్ని సీటు వరకూ తీసుకువెళ్ళాలా? ఆ విషయం ప్రిన్సిపాల్ చూసుకుంటుందా?

సాయంత్రం వరకూ అన్నీ అనుమానాలే.

అరయింది.

వేగంగా కొట్టుకుంటూన్న గుండెతో గుమ్మం దగ్గర నిలబడి వుంది సునాదమాల.

అతిథులు ఒక్కొక్కరే వస్తున్నారు.

అతిథులతో పాటూ నలుగురు అగంతకులు కూడ వచ్చి తమ తమ సీట్లల్లో కూర్చున్నారు - A1- , A2-, A3-, A4.

ఆరుంపావయింది.

ఆరూ ఇరవై.

*        *        *

గ్రీన్ రూమ్‌లో నికుంజ్ విహారి వడావుడిగా అటూ ఇటూ తిరుగుతున్నాడు. కళాభారతి ట్రూపు అతడిదే. ఆఖరి పోరాటం నాటకానికి అతడే దర్శకుడు ఆ నాటకంలో అతడిది మంత్రి పాత్ర.

అదే నాటకంలో అతడి మిత్రుడు ఆటోడ్రైవర్ వేషం వేస్తున్నాడు. అతడి పేరు పద్మాకర్. వారిద్దరూ మంచి స్నేహితులు

నికుంజ విహారికి తండ్రిలేడు. తల్లి వర్థని లక్షాధికారిణి. ఆమె తండ్రి ఆమెను పెద్ద ఆస్థికి వారసురాలిగా మిగిల్చి మరణించాడు. ఆస్థిని నిలబెట్టుకునే లౌక్యం ఆమెకు లేదు. నమ్మకస్తుడయిన మానేజరు కూడ వృద్ధుడయ్యాడు. కొడుకు చేతికి అందివస్తాడనుకుంది. కానీ అతడేమో నాటకాలంటూ ఇల్లుపట్టకుండా తిరుగుతున్నాడు. ఆమెకు అదొక్కటే బాధ.

విహారిలో పట్టుదలా కృషీ లేదనికాదు బియ్యే ప్యాసయ్యాడు. అతడి దృష్టి అంతా నాటక సమాజం మీదనే, అతడు స్థాపించిన కళాభారతి మూడు సంవత్సారాల్లోనే ఆంధ్రదేశపు ప్రతిష్టాకరమైన నాటక సమాజాల్లో ఒకటిగా మారిందంటే దానికి కారణం డబ్బొక్కటే కాదు. అతడి కృషి కూడ అది తల్లికి తెలుసు. ఆమె బాధంతా కొడుకు తన ప్రతిభని అనవసరమైన విషయాలమీద ఎక్కువ ఖర్చు పెడుతున్నాడని! ..... భర్త పోయినప్పటినుంచి ఆమె ఎక్కువగా భర్తినీ మౌనాన్ని ఆశ్రయించింది. ఆమెలో మంచితనమెంత వుందో దానికి రెండురెట్లు అమాయకత్వం కూడ వుందటానికి చిన్న ఉదాహరణ చాలు.

..... వాళ్ళింట్లో వుండే వంటవాడి పేరు గంగులు. పద్మాకర్‌కీ వాడికీ మంచి దోస్తీ.. ప్రశస్తమయిన వంట వాళ్ళందరూ బెంగాలీలను పద్మాకర్ సలహా మీద తన పేరుని గంగూలీగా

మార్చుకున్నాడు. వాడికి ముగ్గురు భార్యలు. డబ్బు అవసరం ఎక్కువ. వారిక్కూడా నాటకాల పిచ్చి కాస్త వుంది. ఇంకో నాలుగు రోజుల్లో పండగనగా వాడి ముగ్గురు భార్యలూ తమకి చీరె కొని పెట్టకపోతే వాడి వెన్నుముక విరగ్గొట్టి సుమంగళి చిత్రంలో సావిత్రిలా అయిపోతామని విడివిడిగా అల్టిమేటం ఇచ్చారు. అంత తక్కువ సమయంలో అంత డబ్బు ఎలా సంపాదించాలో తెలియదు వాడికి.

అంత తలమునకలవుతున్న పరిస్థితుల్లో పద్మాకర్ వాడికో సలహా ఇచ్చాడు. అమ్మగారి దగ్గిరే తన నటనా సామర్థ్యాన్ని పరీక్షించుకుందామనుకుని ఒక నాటకాల కంపెనీ దగ్గర మేకప్ వేయించుకుని ఇంటికి వచ్చాడు.

అమ్మా! ప్రొద్దున్న వచ్చి మీరు శివాలయం పక్కనున్న పుట్టలో పాలు పోశారు కదా

అవునంది వర్ధనమ్మ.

మీరు వేడిపాలు పోసినట్టున్నారు పాము చనిపోయిందమ్మా విషాదంగా అన్నాడు.

వర్ధనమ్మ మొహం వాడిపోయి నిజమా అంది

అవునమ్మా మీరలా పాలుపోసి వెళ్ళగానే అది పుట్టనించి బయటకు వచ్చింది. తోలు కాలి అక్కడి కక్కడే మరణించింది. పక్కనే వున్నాన్నేను ఎవరా అని చూస్తే మీరు

ఆమెకు దుఃఖమొక్కటే తక్కువ. అయ్యో ఇప్పుడెలా?

అయిదు వందలు పెట్టి అర్చన చేయించాలి తల్లీ తర్వాత ఒక ఇత్తడి పాముని కూడ దానమియ్యాలి.

ఆమె శవస్తోత్రం పఠిస్తూ లోపల్నించి డబ్బు తీసుకువచ్చి ఇచ్చింది. గంగూలీ అది తీసుకుని వెళ్ళిపోయాడు. కథ సుఖాంతమయ్యేదే కానీ అప్పుడే పద్మాకర్ విహారి వచ్చి వాడిని రెడ్ హాండెడ్‌గా పట్టుకున్నారు.

ఏరా? మక్కెలిరక్కొట్ట మంటావా? పోలీసుల్ని పిలిపించమంటావా?

వాడి చేతులు జోడించి రెండింటిలో ఏదయినా చేయండి బాబూ కానీ డబ్బులు వెనక్కి లాక్కొని మాత్రం ఇంటికి పంపించకండి అన్నాడు నిజాయితీ ధ్వనిస్తూన్న దుఃఖంతో.

ఎందుకట?

మీకన్నా పోలీసులకన్నా నా భార్యల బాధే ఎక్కువ వారితో మీరు పోటీ పడలేరు.

వర్ధనమ్మ నవ్వుకుని వాడికి డబ్బు ఇచ్చి పంపించి వేసింది.

నువ్విచ్చిన అలుసేనమ్మా ఇది. ఉద్యోగం లోంచి తీసెయ్యక పైగా యింకా డబ్బులిస్తావా?

పోనీలేరా కావలసినంత డబ్బే తీసుకున్నాడు. ఆ భయంలో బంగారు పాము అడిగినా ఇచ్చి ఉండే దానిని అందులోనయినా వాడి నిజాయితీ కనబడుతూంది కదా నవ్వేసింది ఆవిడ.

..... .....

ఇంకా మంత్రిగారు రాలేదుటా? పద్మాకర్ మాటలకి ఆలోచనలుంచి తేరుకుని చూశాడు

విహారి.

హాలు నిండి పోయింది. జనంలో విసుగు కూడ ఎక్కువైనట్టు ఈలలు చప్పట్లు వినిపిస్తున్నాయి చూశావా

ఏం చెద్దాం?

అదే ఆలోచిస్తున్నాను

పద్మాకర్ విసుగ్గా గ్రీన్ రూమ్‌లోకి వెళ్ళాడు. విహారి తెరకాస్త పక్కకు తప్పించి ఆడిటోరియంలోకి చూశాడు. కిటకిటలాడుతున్న జనం. నిజమైన ఆర్టిస్టులకి అంతకన్నా సంతోషం ఏముంటుంది.

అతడు వాచీ చూసుకున్నాడు. ఎడునర్రయింది. మంత్రిగారి కోసం ఇంకా ఎంతసేపు వేచిచూడాలో తెలీదు.

అలా అతడు బయటకు చూస్తున్న సమయాన గుమ్మం దగ్గర నిలబడిన అమ్మాయి మీద అతని దృష్టి పడింది. ముందు ఆ సునాదమాలని చూసి రవీంద్ర కళాక్షేత్ర గుమ్మం దగ్గిర నిలబెట్ట బడిన ప్రతిమ అనుకున్నాడు. పూలగుచ్ఛం భయం భయంగా పట్టుకుని నేలకి కాళ్ళు అంటుకు పోయినట్టు నిలబడివుంది ఆమె. కానీ అంతలోనే ఆ ప్రతిమ కదలటం చూసి తన భ్రమకి నవ్వు రాకపోగా అంత అందమయిన అమ్మాయిలుంటారా అని అతడికి ఆశ్చర్యం వేసింది ఆమె వెన్ను గాండీవాన్ని వక్షం కురుక్షేత్రాన్నీ కనుబొమ్మ విల్లునీ కంఠం పాంచజన్యాన్ని కళ్ళు రథచక్రాల్ని గుర్తుతెచ్చాయి. వాట్లో యుద్ధం ప్రారంభమయింది. స్త్రీల కళాశాల వారు ఈ నాటిక ఏర్పాటు చేశాడని తెలుసు కానీ ఆ కళాశాలలో ఇంత అందమైన అమ్మాయిలుంటారని తెలీదు.

నికుంజ విహారి ఆ అమ్మాయికేసి చూస్తూ అలా ఎంత సేపు వున్నాడో తెలీదు. ఏం చేద్దాం గురూ అని వెనక నుంచి పద్మాకర్ దృష్టి కూడ ఆ అమ్మాయిమీద పడింది మైగాడ్ అన్నాడు ఆమె అందానికి విస్తుబోయి.

ఏం గురూ లవ్ ఎట్ ఫస్టు సైటా?

నీ మొహం నాకిటువంటి ఫస్టు సైట్‌ల మీద నమ్మకం లేదు గానీ, అమ్మాయి చాలా అందంగా వుంది కదూ .....

ఆ విషయం ప్రభుత్వం పార్లమెంట్‌లో పెట్టినా ప్రతిపక్షం కూడా వప్పుకుంటుంది.

కానీ సాధారణంగా ఇంత అందమైన అమ్మాయిలు మెదళ్ళలో అమూల్ మిల్క్ పౌడర్ తప్ప మరేమీ వుండదు.

నేనొప్పుకోను. అందమైన వాళ్ళలో తెలివి తేటలున్న వాళ్ళు కూడా వుంటారు

పందెం కాస్తావా?

పందెం ..... నువ్వోడిపోతే ఆ అమ్మాయితో ఐ లవ్యూ అనిపించుకోవాలి.

ఓడిపోతే ఐలవ్యూ అనిపించుకోవటం ఏమిటి ఖర్మ పెళ్ళే చేసుకుంటాను పందెం.

పందెం ఓడిపోతే చాలా చిక్కుల్లో పడతావ్ గురూ.

ఓడిపోను ఆ టోపి ఇలా ఇవ్వు.